క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ ప్రాగా టూల్స్‌ఫీడర్ పరిధిలోని ఎస్‌సీఎల్ గోదావరి, దుర్గా విహార్, శాంతా శ్రీరామ్, అదిత్య విల్లాస్, కోణార్క్ ఆస్పత్రి, ప్రాగా టూల్స్‌కాలనీ, జీఎల్ఆర్ ఎన్‌క్లేవ్, లక్ష్మీగంగా ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ అదే విధంగా 11కేవీ పైపులైన్ ఫీడర్ పరిధిలోని బీహెచ్‌ఈఎల్ విస్టా కాలనీ, అగ్రికల్చర్, శ్వేత ఆర్యన్,ఆర్బ్స్‌బర్గ్, ఆర్వీ నిర్మాణ్స్, మారుతి సన్‌సిటీ, సుభాష్‌నగర్ రోడ్డు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బీవీఆర్ఐటీ ఫీడర్ పరిధిలో..

నిజాంపేట్: విద్యుత్ మరమ్మతులు నేపథ్యంలో బీవీఆర్ఐటీ ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గాంధీనగర్, వడ్డెరబస్తీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సమస్యలను పరిష్కరిస్తా

రంగారెడ్డినగర్: ప్రజా సమస్యలను పరిష్కరించడంతో ప్రజా ప్రతినిధులు విఫలమవుతున్నారని యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ రాజీవ్ గృహకల్ప వాసులు ఆదివారం విశాల్‌గౌడ్‌ను కలిసి తమ కాలనీలో నెలకొన్న సమస్యలను ఏకరవు పెట్టారు. రాజీవ్‌గృహకల్పలో డ్రైనేజీ లైన్ అస్తవ్యస్తంగా మారిందని.. రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆయనకు తెలిపారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

శిఖర స్కూల్‌లో హోమం



దుండిగల్: విద్యార్థులు చదువులో మంచి ఫలితాలు సాధించాలని శిఖర హైస్కూల్ ప్రిన్సిపాల్ హేమలత అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్‌లోని శిఖర స్కూల్‌లో హోమం నిర్వహించారు. విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులతో పాటు మంచి మార్కులు సాధించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ హోమం నిర్వహించామని ప్రిన్సిపల్ హేమలత అన్నారు.

నేడు హరితోత్సవం

నిజాంపేట్: బాచుపల్లి సాయినగర్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వద్ద సోమవారం హరితోత్సవం నిర్వహించనున్నామని నిజాంపేట్ మేయర్ నీలారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.

గుడిసెవాసులపై నిర్బంధాన్ని వెంటనే ఆపాలి

నిజాంపేట్: పేదలకు గూడు కల్పించేందుకు తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ వరకు బస్సు యాత్ర చేపడుతున్నట్లు మేడ్చల్ జిల్లా కేవీపీఎల్ కార్యదర్శి బాలపీరు ఓ ప్రకటనలో తెలిపారు. గుడిసెవాసులపై ప్రభుత్వ నిర్బంధాన్ని వెంటనే ఆపాలని.. కేసులు ఎత్తివేయాలని.. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికి 125 గజాల స్థలాన్ని కేటాయించి పట్టాలు ఇవ్వాలని.. ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఆర్థిక సహాయం చేయాలని.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని.. ఇళ్ల పట్టాలు పొందిన పేదలకు వెంటనే సరిహద్దులు నిర్ణయించి భూమిని అప్పగించాలనే డిమాండ్లతో ఈ బస్సుయాత్ర కొనసాగుతుందన్నారు. ఈ యాత్రకు అన్నివర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.

గోదాంలో వ్యక్తి మృతదేహం లభ్యం

కుత్బుల్లాపూర్: ఖాళీగా ఉన్న గోదాంలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లికి చెందిన సుదర్శన్‌రెడ్డి కొంపల్లి ఎన్‌సీఎల్ నార్త్‌లో శివరెడ్డి పేరు మీద గోదాంలు నిర్వహిస్తు సీడ్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కాగా ఈనెల 17న ఖాళీగా ఉన్న గోదాంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని గోదాం మేనేజర్ శివజష్‌రాజ్ ఫోన్‌లో సుదర్శన్‌రెడ్డికి సమాచారం ఇచ్చాడు. దీంతో వెంటనే గోదాంకు చేరుకుని సదరు వ్యక్తి వివరాల కోసం ఆరా తీయగా ప్లాస్టిక్, చెత్త పేపర్లు ఏరుకుంటూ ఫుట్‌పాత్‌లపై నివసించే బసంత్‌గా గుర్తించారు. గోదాం నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మొదట అనుమతి లేదంటూ నోటీసులు ఇస్తారు. ఆ తర్వాత జేబు నింపితే అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తారు. ఇదీ కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని టౌన్‌ప్లానింగ్ అధికారులు తీరు.! 'ప్రభుత్వ ఆదాయానికి గండి పడినా పర్వాలేదు. కానీ తమ జేబు నిండితే చాలు'అని అధికారులు అనుకోవడం శోచనీయం. నోటీసుల పేరుతో లక్షల్లో దండుకొని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడం గమనార్హం. అధికారులు తొండి చేయకుండా తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తే.. ప్రభుత్వ ఆదాయానికి గండి పడే అవకాశం ఉండదు. కానీ అధికారులు తమ విధులను విస్మరించడం బాధాకరం.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

విధులతో అధికారుల తొండి!

- నోటీసుల పేరుతో లక్షల్లో వసూలు
- అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున వైనం
- జేబు నిండితే చాలు అన్నట్లుగా టౌన్‌ప్లానింగ్ అధికారులు



అనుమతులు లేని అక్రమ నిర్మాణం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. అయినా అధికారులు చోద్యం చూస్తున్నారు. కేవలం బిల్డర్లు, నిర్మాణదారులు ఇచ్చే డబ్బులకు ఆశపడి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంపై దృష్టి సారించకపోవడం గమనార్హం. నోటీసులు ఇచ్చినా డోంట్ కేర్ అంటూ...

– రాఘవేంద్ర కాలనీలో జి ప్లస్ టు పర్మిషన్ తీసుకొని అదనపు అంతస్తు..పెంట్ హౌస్ వేశాడు ఓ వ్యక్తి. ఈ నిర్మాణంపై పలు ఫిర్యాదులు రావడంతో అధికారులు మొదటి నోటీసుకు లక్ష.. రెండో నోటీసుకు మరో లక్ష ఇలా రెండు దఫాలుగా చేతివాటం ప్రదర్శించినట్లు సమాచారం. అంతేకాదు బిల్డింగ్‌పై ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిని కూడా మేము మాట్లాడి సెటిల్ చేస్తామంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులే ఇలా బరితెగించడం గమనార్హం.

◆ మొత్తం మీద ఈ నిర్మాణానికి నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో జోనల్ స్థాయి విజిలెన్స్ విభాగం కూల్చివేయాలి. కానీ వారు కూడా అవినీతికి అలవాటు పడడంతో గత వారం రోజులుగా నిర్మాణదారుడు బిల్డింగ్ బయట ఉన్న మొత్తం గోడలకు సున్నం వేస్తూ పూర్తి చేయడం గమనార్హం. సదరు యజమాని ఇంటి పర్మిషన్ తీసుకొని షట్టర్లు వేసి గోదాంకు అద్దెకు ఇస్తామని ఫ్లెక్సీ ఏర్పాటు కూడా చేశారు.

రెండు పర్మిషన్లు ఒకే నిర్మాణం

◆ అదే విధంగా కుత్బుల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ముందు ఓ వ్యక్తి రెండు పర్మిషన్లు తీసుకుని ఒక నిర్మాణం చేపట్టాడు. గృహ అవసరాల కోసం పర్మిషన్ తీసుకున్న యజమాని ముందు భాగం షట్టర్లు వేసి కమర్షియల్‌గా మార్చడం వెనక టౌన్ ప్లానింగ్ అధికారుల హస్తం ఉందని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ నిర్మాణ విషయంపై కూడా పెద్ద మొత్తంలో చేతులు మారినట్లు సమాచారం. అయితే తమ చేతులకు మట్టి అంటకుండా ఇప్పటికే ఒక నోటీసు ఇచ్చినట్లు అధికారులు చెప్పడం విశేషం.

◆ రెండు పర్మిషన్లు తీసుకుని ఒకే నిర్మాణం చేపడితే అట్టి నిర్మాణాన్ని ఆపేయాలి. అంతేకాకుండా షట్టర్లు వేస్తే వాటిని కూల్చివేయాలి. కానీ ఇక్కడ అధికారులు వ్యవహరిస్తున్న తీరు మాత్రం పలు అనుమానాలకు దారితీస్తున్నాయి. ఎక్కడపడితే అక్కడ అక్రమ నిర్మాణాలను అధికారులే ప్రోత్సహిస్తూ అందిన కాడికి దండుకుంటూ గ్రేటర్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఎక్కడైనా అక్రమ నిర్మాణం చేయబడితే ప్రారంభ దశలోనే వాటిని అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు వారికి పూర్తి భరోసా ఇస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారన్న ప్రధాన ఆరోపణలు ఉన్నాయి.



కుత్బుల్లాపూర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్ ఎదురుగా జరుగుతున్న నిర్మాణం

కొద్దిగా జరిగారని రెండు లక్షలు డిమాండ్...

ఇటీవల. జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో ఓ వ్యక్తి నిర్మాణం చేపట్టగా కొంత నిర్మాణం జరిగి కట్టాడు. దీంతో రెండు లక్షలు ఇవ్వాలని లేనిపక్షంలో నోటీసు జారీ చేస్తామని.. నిర్మాణాన్ని కూల్చివేస్తామని బెదిరించడంతో సదరు యజమాని కంగు తిన్నట్లు సమాచారం. ఇలా అనేక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ టౌన్ ప్లానింగ్ అధికారులు లక్షలాది రూపాయలు జేబులో వేసుకుంటూ ఫిర్యాదుల విషయంలో కాలయాపన చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

కూల్చివేసే అధికారం మాకు లేదు: అసిస్టెంట్ సిటీ ప్లానర్

అక్రమ నిర్మాణాలపై కుత్బుల్లాపూర్ సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సాంబయ్యను సాక్షి వివరణ కోరింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రాఘవేంద్ర కాలనీలో అక్రమ నిర్మాణం జరుగుతున్న విషయంపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. వెంటనే నోటీసులు అందజేసి జోనల్ విభాగం అధికారులకు పంపించామని తెలిపారు. కుత్బుల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల ఎదుట జరుగుతున్న నిర్మాణ విషయం తనకు తెలియదని పేర్కొన్నారు. తాము కేవలం నోటీసులు జారీ చేస్తాం తప్ప కూల్చివేతలు చేపట్టమని తెలిపారు. ఆ పని జోనల్ టాస్క్‌ఫోర్స్ విభాగం అధికారులు చూసుకుంటారని పేర్కొన్నారు.

పథకాలను నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

రంగారెడ్డినగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కె.ఎం.ప్రతాప్ అన్నారు. ఆదివారం రంగారెడ్డినగర్‌లో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ... అసంఘటిత రంగానికి చెందిన భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. వారికి ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యం లేకపోవడంతో వారి కుటుంబాలు ఎంతో నష్టపోతున్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు తెలియకపోవడంతో చాలా మంది కార్మికులు నష్టపోతున్నారని తెలిపారు. ఈ విషయమై స్థానిక ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు అండగా నిలవాలన్నారు. కార్మికులు ఐక్యంగా ఉంటూ తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వీర నాగప్ప, సర్కిల్ అధ్యక్షులు బాలాజీ, సలహాదారులు మహ్మద్ ఖాన్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కేఎం ప్రతాప్

క్రీడాకారులకు అభినందనలు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బాచుపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన 20మంది విద్యార్థులు అండర్ - 14, 17 విభాగాలకు రూరల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలకు ఎంపికయ్యారు. జూలై 1, 2వ తేదీలలో మహారాష్ట్రలో జరిగే ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆదివారం ఎమ్మెల్సీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించిన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ అతియా సుల్తానా, వైస్‌చైర్మన్ పద్మారావు, కార్పొరేటర్ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

సంప్రదాయాల పరిరక్షణలో బ్రాహ్మణులు మార్గదర్శకంగా ఉండాలి

సుభాష్‌నగర్: దేశ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో బ్రాహ్మణులు మార్గదర్శకంగా ఉండాలని సూరారం సీఐ వెంకటేశ్వరరావు అన్నారు.

శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సూరారం కాలనీ శ్రీవాసవీ ఆర్యవైశ్య భవనంలో ఆదివారం ఉచిత నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి చేపట్టారు. సిఐ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలకు చక్కటి క్రమశిక్షణ నేర్పించి సమాజంలో మార్పు కోసం కృషి చేయాలన్నారు. శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్, ఎస్ఐ రామ్‌రెడ్డి, సంఘం ముఖ్య సలహాదారుడు సర్వేపల్లి రమేష్ కుమార్, వేద పండితులు పరుశురామ శర్మ, చక్రధారి శ్రీరామ శర్మ, సంజీవరావు, దుర్గా నాగమోహన్, హరి రాఘవేంద్ర, శ్రీధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



నోట్ పుస్తకాల పంపిణీలో పాల్గొన్న సీఐ వెంకటేశ్వరరావు

ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఢీకొట్టిన టిప్పర్

పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు

జగద్గిరిగుట్ట: నిద్రమత్తులో డ్రైవింగ్ చేస్తూ ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 5.30గంటల సమయంలో డ్రైవర్ షాబాద్ హుస్సేన్ తన టిప్పర్‌ను నడుపుకుంటూ ఆల్విన్‌కాలనీ నుంచి జగద్గిరిగుట్ట వైపు వెళ్తున్నాడు. బస్టాప్ సమీపంలోని ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఢీకొట్టాడు. దీంతో విగ్రహం పూర్తిగా ధ్వంసమయ్యింది. ఈ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్‌కు ఫిర్యాదు చేశారు.





టిప్పర్ ఢీకొట్టడంతో ధ్వంసమైన విగ్రహం, ఫిర్యాదు చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి

ఫలించిన ప్రొ.అన్సారీ పోరాటం

ఎట్టకేలకు నో డ్యూస్ సర్టిఫికెట్ జారీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ లింగ్విస్టిక్స్ విభాగం విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్సారీ గత ఐదు నెలలుగా నో డ్యూస్ సర్టిఫికెట్ కోసం చేసిన పోరాటానికి ఫలితం దక్కింది. ఉద్యోగ విరమణ అనంతరం పని చేసేచోట ఎలాంటి బాకీ (నోడ్యూస్) లేదని సర్టిఫికెట్ తీసుకొని పాలన భవనంలో సమర్పిస్తేనే రిటైర్మెంట్ బెనిఫిట్స్, పింఛన్ లభిస్తాయి. కానీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ కార్యాలయం నుంచి సకాలంలో నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వనందున వరసగా దీక్షలు చేపట్టి అధికారులపై ఒత్తిడి తేవడంతో ఎట్టకేలకు నోడ్యూస్‌ను జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రొ.అన్సారీ మాట్లాడుతూ..తన పోరాటానికి మద్దతు తెలిపిన మీడియా, విద్యార్థి నేతలు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓయూలో రేపు తెలంగాణ ఉత్సవాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో రేపు (20న) తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నారు. క్యాంపస్‌లోని వివిధ కాలేజీల నుంచి డాక్టర్. జి నాగయ్య ఓపెన్ ఎయిర్ ఎంపి థి యేటర్ వరకు తెలంగాణ మార్నింగ్ వాక్ చేపట్టనున్నారు. ఆయా కాలేజీల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించి సాయంత్రం ఓపెన్ థియేటర్‌లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో బహుమతులు అందచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సురక్షిత నీటిని అందించడమే లక్ష్యం



దేవేందర్‌నగర్‌లోని రిజర్వాయర్ వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్
- ఘనంగా తెలంగాణ మంచినీళ్ల పండగ

కుత్బుల్లాపూర్: సురక్షిత తాగునీటిని అందించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం ×తెలంగాణ మంచినీళ్ల పండగ÷ను ఘనంగా నిర్వహించారు. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ మంచినీటి రిజర్వాయర్ నుంచి ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం షాపూర్‌నగర్ పోచమ్మ ఆలయంలో మహిళలు బోనాలతో ప్రత్యేక పూజలు చేసి ఎంజే గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, వాటర్ పొల్యూషన్ డిటెక్టివ్ ఎక్విప్మెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. తాగునీరు ఏ విధంగా ఉందో స్వతహాగా పరీక్ష చేసుకునేందుకు వీలుగా రూపొందించిన క్వాలిటీ కిట్‌లు 20 మంది వినియోగదారులకు పంపిణీ చేశారు.

◆ అదే విధంగా ప్రజలకు త్రాగునీరు అందించడంలో ఉత్తమ సేవలు అందిస్తున్న జలమండలి అధికారులను, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తాగునీటి కోసం ధర్నాలు, మహిళలు బిందెలతో యుద్ధాలు ఉండేవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగునీటిని అందిస్తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా మురుగునీటి శుద్ధికి ఎస్టీపీ ప్లాంట్లను ఏర్పాటు చేసి చెరువులు కలుషిత కాకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి, వాటర్ వర్క్స్ డైరెక్టర్ ఆపరేషన్ స్వామి, జీఎంలు శ్రీధర్‌రెడ్డి, సంతోష్ కుమార్, డీజీఎంలు, వివిధ సెక్షన్ల మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే బంగారు తెలంగాణ సాధ్యం

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: కాంగ్రెస్ పార్టీతోనే బంగారు తెలంగాణ సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో హన్మంతరెడ్డి చేపట్టిన 'హాథ్ సే హాథ్ జోడో'పాదయాత్ర 100 రోజులు పూర్తి చేసుకుంది. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్‌లో పర్యటించిన ఆయన కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. ఇరు ప్రభుత్వాల పాలనలో నిత్యావసరాలు, విద్యుత్, ఆర్టీసీ చార్జీలు విపరీతంగా పెరిగాయన్నారు. ఈసారి ఎన్నికల ప్రచారానికి వచ్చే ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, జేమ్స్, సంజీవరెడ్డి, శ్రీశైలంయాదవ్, జీతయ్య, శంకర్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

సుభాష్‌నగర్: తెలంగాణాలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. రాష్ట్రం వ్యాప్తంగా కొనసాగుతున్న చేరికలే అందుకు నిదర్శనమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. సూరారం కాలనీ డివిజన్ నెహ్రూనగర్‌కు చెందిన వివిధ పార్టీలకు చెందిన మహిళలు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు.

ప్రజా సమస్యలు పట్టడం లేదు..

కుత్బుల్లాపూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. ఇంటింటికీ కాంగ్రెస్ పాదయాత్రలో భాగంగా ఆదివారం ఆయన దూలపల్లిలోని 16, 17, 18 వార్డులో ప్రచారం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు తొలగిపోవాలంటే అధికార మార్పు అనివార్యమని ఆయన అన్నారు. ప్రస్తుత ప్రజాప్రతినిధులు సంపాదన ధ్యేయంగా పని చేస్తున్నారని ఆరోపించారు. వారికి ప్రజా సమస్యలు పట్టడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో అలాంటి నాయకులకు బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్, జయభేరి మాధవి, గోపాల్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట్‌లో పర్యటిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

'రేవంత్ అన్న మాట.. కాంగ్రెస్ ముచ్చట' పోస్టర్ ఆవిష్కరణ



జీడిమెట్ల: కేసీఆర్ కుటుంబీకుల దోపిడీ నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడాలంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంఘం వీరేష్‌గుప్తా ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్‌కు చెందిన యువకులు, మహిళలు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ×రేవంత్ అన్న మాట కాంగ్రెస్ ముచ్చట÷అనే పోస్టర్‌ను రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. రేవంత్ రెడ్డిని కలిసిన వారిలో టి.శివరామకృష్ణ, హబీబ్, ఇంతియాజ్, ప్రకాష్, జీవన్, అవినాష్‌మిత్రా, సురేష్, వినయ్‌కుమార్, నసీం, అహ్మద్, యాదమ్మ, లలిత తదితరులు ఉన్నారు.